పంతాలు పట్టింపులు
పటాపంచలు చేసి
అతడికి ప్రశాంతతను
అందించిందెవరు?

# మనసులో వాన!

**అద్దేపల్లి సుచిత్రాదేవి**

**కథ**

బయట జోరున కురుస్తోంది వాన. కరెంటు లేదు. రాత్రి తొమ్మిది గంటలకే వూరంతా మాటుమణిగి పోయినట్లుంది. కిటికీ దగ్గర కుర్చీ లాక్కొని వీధిలోకి చూస్తున్న రాజుకి అంత వర్షాన్ని చూస్తుంటే ముచ్చటగా వుందికానీ కరెంటు లేదన్న విషయం గుర్తు చేస్తూ చిరాగ్గానూ వుంది. "వెధవ కరెంటు ఎప్పుడూ సరిగా వుండి చావదు. ఎండాకాలం పవర్ కట్ అంటారు . వానాకాలం వానల, వరదలంటారు. ప్చ్... పగలంతా లేకపోయినా పరవాలేదుకా నీ రాత్రికూడా యివ్వకపోతే ఎలా నిద్రపోవటం?''

అప్పటికలా తిట్టుకోవటం తొంబై యారోసార్లై యుంటుంది. రాజుకి వాళ్ళ సీలింగ్ ఫేను గుడగుడ తిరిగే శబ్దం వినకపోతే నిద్రరాదసలు. గాలి మాట అటుంచి మరి కరెంటు లేకపోతే ఫేను తిరిగేదెలా?

"అబ్బబ్బ. యిదేం ఫేను బాబూ, రైసుమిల్లులాగ తిరుగుతుంది అదీ బెడ్‌రూమ్‌లో, ఇంత శబ్దంలో నిద్రెలా పోతారు మీరు. కొత్త ఫేను వేద్దామండీ ఈ గదిలో'' రాజు భార్య విమల ఎప్పుడూ విసుక్కుంటుంది ఆ ఫేన్ చప్పుడికి.

విమలకేం తెలుసు ఆ శబ్దం వింటుంటే రనకు వుయ్యాల్లో వూగినట్లుంటుందని, అందుకే ఎన్ని కొత్త వస్తువులు కొన్నా దాన్ని మాత్రం మార్చలేదు. విమల గుర్తుకు రాగానే మనసులోనూ, శరీరంలోనూ ఏదో అలజడి. అరచేతుల్ని గట్టిగా రుద్దుకుని చెంపల కానించుకుంటూ చిరాకుపడ్డాడు భార్యపై.



''బుద్ధి లేకపోతే సరి, ఈ వర్షాకాలంలో యిపుడర్జంటుగా పిల్లాడ్ని కనాలా?''

''ఏ విర్వాకమేగా?!'' మనసు దెప్పి పొడిచింది.

''నిజమే తవకే బుద్ధి లేకపోయింది. కానీ ఆ వచ్చిన దానికి విమల అంతలా అంటుకుపోతుందని తాననుకున్నాడా, తమ కప్పుడే పిల్లలొద్దు, జీవితాన్ని మరికొన్ని

రోజులన్నా ఎంజాయ్ చెయ్యాలన్న తన వాదాన్ని త్రోసిపుచ్చింది. పిల్లలు ఎంజాయ్‌మెంట్లుకేమీ అడ్డురారట. గాడిద గుడ్డు కాదూ? కదిలినా, మెదిలినా పక్కలో పిల్లాడు కేరుమంటుంటే యింకా ఎంజాయ్‌మెంటేమిటి మొహం. ఇల్లు కదలాలంటే పిల్లాడితో పెద్ద సరంజామా సిద్ధం. ఇంటా బయటా సుఖముండదు. స్వేచ్ఛగా ప్రేమ పక్షుల్లా తిరిగే వాళ్ళకి కోరి సంకెళ్ళు వేసుకున్నట్లే సంతానం.

కానీ తన మాట వింటేనా? బిడ్డనుకనే తీరుతానంది. ఇంకా రూపం కూడా దిద్దుకోని ఆ బిడ్డే కావాలో, తాను కావాలో తేల్చుకోమన్నాడు తను.

ఇద్దరూ కావాలన్నది విమల. ససేమిరా వీల్లేదన్నాడు తను. ఫలితం విమల పుట్టింటి కెళ్ళిపోయింది. ఆ రోజు ఆటో ఎక్కబోతూ తన దగ్గరకొచ్చి ఏమన్నాది?

"ఇప్పుడు కాకున్నా మరో రెండు మూడు నెలల తర్వాతైనా ఎటూ డెలివరీకని అమ్మావాళ్ళ దగ్గర కెళ్ళాల్సిందే. అదేదో కాస్త ముందుగా వెళ్ళినట్లనుకుంటాను. పాపాయి పుట్టగానే ఉత్తరం వ్రాస్తాను. వస్తారుగా. వస్తారులే. అందాకా గుర్తుగా..." అంటూ తనూహించే లోపల చటుక్కున వంగి పెదవులపై తీయగా ముద్రవేసింది. తాను కోపంగా ముఖం తిప్పుకుంటే పాపం ఎంత చిన్నబోయింది?

ప్చ్... ఏం పాపంలే. చక్కగా తన పంతమే నెగ్గించుకుంది. పది నెలలు మోసి పిల్లాడ్ని కననే కంది. పైగా బాబంతా మీ పోలికేనండీ అంటూ ఉత్తరాలు.

ఆవిడకేం మహా వెచ్చగా చంటివాడ్ని పక్కలో వేసుకుని హాయిగా నిద్రపోతూ ఉంటుందేమో ఈ వరకు. ఇక్కడ, ఈ చలిలో ఈ మొగుడనే జీవి ఎంత గడగడలాడుతున్నాడోనన్న ఆలోచన కూడా లేకుండా.

"దబ్" మని కిచెన్‌లోంచి ఏదో పడిన శబ్దమయింది. ఎలుక కాబోలు ఏదో తోసినట్లుంది. పాడు ఎలుకలు విమల వున్నప్పుడు యిన్ని వుండేవి కావు. ఈ మధ్య మరీ ఎక్కువయ్యాయి. ఇంట్లో సందడిగా తిరిగే యిల్లాలు లేదుకదా తానెప్పుడో ఉదయం పోయి రాత్రికి వస్తాడు. మనిషి అలికిడే లేక వాటి యిష్టారాజ్యమైపోయింది. వాటిలాగే తన మనసులో కోరికలూ విమల లేకపోయేసరికి మరీ అల్లరి పెడుతున్నాయి. కానీ విమల దగ్గరకు పోకూడదని పంతం. ప్చ్... ఆడగాలి తగిలి శరీరానికి ఎన్ని రోజులయింది? ఈ వానలో, విమల గనుక యిప్పుడు పక్కనుండి వుంటే?!... మళ్ళీ ఏదో తోసిన శబ్దము వంటింట్లోంచి. లేచి వెళ్ళి కేండిల్ అన్నా వెలిగించి చూస్తేనో అనిపించింది. కానీ అదో క్షణమే. మళ్ళీ బద్ధకమే. "పోనిద్దూ, ఏమున్నాయక్కడ? కేండిల్ వెలిగించటమెందుకు దండగ. తన కింకేం పనుంది. పడుకోవడమేగా!"

"కానీ పడుకోని మాత్రమేం చేయాలి. అప్పుడే నిద్ర వచ్చి చావదు". కిటికీలోంచి చూస్తుంటే వీధిలో వాన హోరే తప్ప మరేమి కనిపించటం లేదు.

ఇంతలో పెద్ద మెరుపు. ఆ వెలుగులో

తమ యింటి గేటు దగ్గర రెండు ఆకారాలు. ఒక ఆడ మరొకరు మగ. ఇద్దరూ ముద్దగా తడిసి ఒకరికానుకుని ఒకరు నడుస్తున్నారు. ఆ అరనిముషపు వెలుగులోనూ రాజు మగకళ్ళు ఆ ఆడమనిషినే గమనించాయి. తడిసిన నేత చీరలో పుష్టిగావున్న అవయవ సంపద కళ్ళు జిగేల్మనిపించింది. మగమనిషి చేతిలో ఏదో పెద్ద సంచీ వుంది.

"ఎవరు వాళ్ళు? ఈ టైమ్‌లో యిటు వస్తున్నారు?" రాజు కళ్ళు చించుకుంటూ ఆ చీకట్లోకి చూసాడు. ఎదురింటి వాళ్ళ కిరోసిన్ దీపం కాంతిలో అస్పష్టంగా కనిపిస్తున్నారు వాళ్ళు. వచ్చి మెల్లగా రాజు యింటి వరండాలో ఓ మూలగా గోడపక్కగా కాబోలు చేరారు. "దీపం లేదీ యింట్లో. మడిసి అలికిడే లేనట్టుంది. ఎవురూ వున్నట్టు లేరీడ. ఈడే పడుకుని పొద్దుగాలే లేసి పోదాం" అంటూంది మగ గొంతు.

"అంతేలే. అయినా మేస్త్రియ్యతో తగుబెట్టుకోకయ్యా అన్నా. నా మాటిన్నావా. యిప్పుడు జూడు. బంగళాలోంచి ఎల్లకొట్టేసిందు. వానల్లగ్గిన దాకా ఎచ్చగా ఆడే వుండే వాళ్లం. ఈ వానల్లో కూలీలేడ దొరుకుతాయో ఏమో?' ' ఆడ కంఠంలో నిష్ఠురత.


"ఛస్ నోరుముయ్. ఆ ఎదవ నా కొడుకు గురించి మళ్లీ మాట్లాడితే మక్కెలి రగదంతా. ఆడి కింద పని సేసే ప్రతి ఆడదల్లా ఆడి 'కిందికి' రావాలంటాడు. ఏందేయ్, ఈ యేలప్పుడు ఆడు గురుతుకొచ్చిండు. ఆడి సాటుమాటు సరసమ్మాటలు లేయని దిగులుగాగాని వుందా ఏంది?"

"ఇగో. వుట్టి పున్నేనికి నన్నట్టాటి మాటలంటే కల్లుబోతాయి. అయినా ఆ ఎదవవరో వన్ను జూస్తే అందులో నా తప్పేంది?"

ఆడ కంఠంలో వుక్రోష.

"నీ తప్పా, ఇట్టా పిటపిటలాడి పోతూండడమే నీ తప్పు".

మగాడి కంఠంలో కాసింత మురిపెం.



ఏం చేసాడో కానీ ఆమె కిలకిలా నవ్వింది.

"అబ్బ ఏంది మావా, గమ్మగుండు" అంటూ.

అంతవరకూ వింటున్న రాజు నరాల్లో ఆ నవ్వు రాగాల్ని మీటినట్లయింది. అతనికి విమల నవ్వు గుర్తుచ్చింది. ఎంత బాగా నవ్వుతుంది. నవ్వేనా? అంతకన్నా బాగుండే విమల శరీరం గుర్తొచ్చింది. రాత్రయితే చాలు. ఎన్ని వూసులు, ఎన్నెన్ని బాసలు, ఒక రోజు పాటలకి ముద్దులయితే, మరోరోజు జోక్సుకి ముద్దులు. ఎన్నెన్నో సరదా పందేలు, సరస సరాగాలు, అసలిన్ని రోజులు విమల లేకుండా ఒంటరిగా తానెలా వుండగలిగాడు.

"ప్చ్, విమల మరీ ఈ రోజు యింతగా గుర్తొస్తుందేం?"

మనసుని వాళ్ళిద్దరి మాటలపై మళ్ళిం చాడు.

ఆ యింట్లో ఎవరూ లేరన్న ధైర్యంతో, నిస్సంకోచంగా, కాస్త పెద్దగానే మాట్లాడు కుంటున్నారా జంట. రాజుకి వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయే కానీ వాళ్ళు కనిపించటం లేదు. వాళ్ళ మాటల్ని బట్టి వాళ్ళిద్దరూ కూలీలని అర్థమైంది.

"అబ్బ, ఏం వాన? సీ, కోకా, రైకా అన్నీ తడిసిపోయినై, సలేస్తంది".

ఆమె కంఠంలో చిరు వణుకు.

"సెట్టంత పెనిమిట్ని పక్కలో పెట్టు కుని సలేస్తాదంటావేందే? ఇట్టా జరుక్కో కాసింత" మగాడి నవ్వు.

"ఏం జరగాల. నీ పంచా సొక్కా కూడా తడిసి పోయుండాయి"

"ఛస్, నీ యమ్మ అన్నీ తీసి పిండట్టారె య్యి. తెల్లారికి రవంతన్నా గాలికారుతాయి."

"సంబడమే. సంచిలోయి అన్నీ తడిసే వుండాయి. యియ్యి యిప్పి ఆరేస్తే ఏం గట్టుకు పడుకోవాలా?"

"ఈ సీకట్లో, వానలో ఈ మూలకెవ రు జూస్తారే?"

"ఓలమ్మో అంటే ఒంటి మీదేం లేకుండానే.. అవ్వ!"

"అవ్వా లేదు బువ్వా లేదు. సెప్పినట్టు సెయ్యి లేదంటే పొద్దుగాలికి యిద్దరం సలికి ఈ నీళ్ళడిసే గుడ్డలతో సచ్చిరుకుంటాం".

"సర్లేగాని మావా బువ్వంటే గేపకానికొ చ్చింది. ఆకలేయడంలా నీకు?"

"ఏస్తంది. ఏసేం లాభం. తిండానికేం లేనప్పుడు. కాళ్ళు కడుపులో పెట్టుకుని పడుకోవడమే".

వింటున్న రాజుకి తానిందాక సగమే తిన్న అన్నం కేరియర్ మనసులో మెదిలింది. "చాలా అన్నమూ, కూరలు అలాగే వున్నాయి.

పాపం పోనీ వాళ్ళకిస్తేనో?" అనుకున్నా డు.

"అబ్బ, కడుపులో కాళ్ళంటూ మీదేస్తా వేంది మావా?" ఆమె నవ్వు గుసగుసగా.

రాజు మనసు మార్చుకున్నాడు. "ఊహు, తానిప్పుడు తలుపుతీసి వాళ్ళను పిలిస్తే, వాళ్ళు ఎలాంటి స్థితిలో వున్నారో హఠాత్తుగా తనను చూసి భయపడవచ్చు, సిగ్గు పడవచ్చు. ఆ తర్వాత వాళ్ళకు

స్వేచ్ఛ వుండదు. ఆ తడిబట్టలే కట్టుకుని, చలికి వణుకుతూ... ప్చ్ తిండిలేకపోతే ఏం వాళ్ళకేం ఆ బాధ పెద్దగా లేనట్లుంది. ఎంతో హాయిగా... కువకువ లాడుతూ...''

రాజుకి తన మీద తనకే జాలేసింది.

కొత్తగా కట్టుకున్న సొంత యిల్లు. ఆ యింటిలో ప్రత్యేకించి నిర్మించుకున్న అంద మైన పడగ్గది. డబుల్ కాట్ ఫోమ్‌బెడ్, చలినేమాత్రం దూరనికి రజాయి. యివన్నీ ... యివన్నీ కూడా వృధానే. ఆ కూలివాడే తనకన్నా అదృష్టవంతుడు! ఎప్పుడు పేవ్‌మెంట్లు మీదా, బస్టాండ్‌లలోనూ, రైల్వే స్టేషన్లలోనూ బ్రతుకులు గడిపేస్తున్న వాళ్ళ ని చూస్తే రాజుకి ఎంతో అసహ్యంగానూ, ఆశ్చర్యంగానూ వుండేది.

''ఏం చూసుకుని బ్రతుకుతున్నారు వీళ్ళంతా? ఎండకి ఎండుతూ వానకి తడుస్తూ, జంతువుల్లా. అసలలాంటి దరిద్రపు బ్రతుకు బ్రతకాలని ఎలా అనుకుంటున్నారు వీళ్ళంతా'' అనుకునేవా డు. కానీ ఆ జంటని చూస్తుంటే అతని కనిపించసాగింది. వీళ్ళకి కారులు, మేడలు లగ్జరీల మాటటుంచి కాలే కడుపుకి తర్వాతి పూటకి తిండికూడా లేకుండా పోవచ్చు. కానీ బ్రతుకు చివరికంతా నడిచేందుకు కావలసిన మనోధైర్యాన్నిస్తూ, మమకారాన్నం దిస్తూ ఒక ఆసరావుంది. తనదంటూ ఒక తోడువుంది. మనషులేర్పరుచుకున్న సుఖా లు, లక్జరీలు వాళ్ళకి లేవు. పాపం కావాలని కూడా అనుకోరేమో. ''అయ్యన్నీ పెట్టి పుట్టిన మారాజులకే'' అనుకునే కర్మ సిద్ధాంతమూ వాళ్ళనంటుకునే వుడుతుందే మో. కానీ ప్రకృతి మానవులందరికీ శరీరంతోపాటే సమానంగా యిచ్చిన ఈ సుఖం మాత్రం వీళ్ళ నుంచి ఎవరూ దోచుకోలేరు. రాజుకా జంటలో యిప్పుడు కోరికల వేడి కనిపించటం లేదు. ఓ ఆత్మీయత. అంతకన్నా తెలియని ఏదో ఓ అపురూప భావనే కనిపించసాగింది.



## టార్చిలైటు!

''రేపు జైలు నుండి విడుదల కాగానే టార్చిలై టు కొంటావా!''

''దేనికి!''

''పోయినసారి, ఓ యింట్లో దూరాక కరంటు స్విచ్చనుకొని రేడియో స్విచ్చు నొక్కి పట్టుబడి పోయా!''

– సిరిసిల్లా రశీద్ శిక్షక్ (దోస్కుల్)

''అబ్బ, యికనన్నా కన్నుముయ్యనీ మావా!'' ఆమె కంఠం మత్తుగా, చిరుకోపంగా, అతని ఆలోచన్లను చెదరగొడుతూ వినిపించింది.

''సరిసరి పడుకో. సీకట్లోనే ఎలిపోదాం ఈడనుండి'' అతడి కంఠమలా ఆవులిస్తూ.

''లాభం లేదు. ఇకీ ఒంటరి జీవితం తనవలన కాదు. ఉదయాన్నే లేచి మొదటి చేయాల్సింది విమల దగ్గర కెళ్ళటము. విమల నవ్వుతుందేమో నవ్వనీ, తనూ నవ్వేస్తే సరి. చిత్తయిపోదూ!?

రేపు రాత్రికి యివరకు తను విమల ఒడిలో పడుకుని విమల చెప్పే కబుర్లు వింటూ...''

ఆ ఆలోచనతోనే ఏదో పెద్ద చికాకు తీరిపోయినట్లునిపించింది రాజుకి. కిటికీ దగ్గర్నుంచి లేచి వెళ్ళి మంచంపై పడుకుని రజాయిని కాళ్ళపై నుంచి లాక్కున్నాడు. పైన అస్పష్టంగా తెల్లని రెక్కలతో నిశ్చలంగా సీలింగ్ ఫాను, కరెంటు లేనందుకు యిప్పుడు తనికి చిరాగ్గా లేదు.

''ఈ రాత్రికి కరెంటు రాకుండా వుండాలి పాపం. లేకపోతే స్ట్రీట్‌లైట్ కాంతి సరిగ్గా తమ వరండాలోనే పడుతుంది. వాళ్ళిద్దరికీ చీకటి కట్టిన తెరలు ఆ వెలుగుకి చెదిరిపోకూడదు!''

జీవితంలో మొట్టమొదటసారిగా తనూ, తన స్వార్థమే కాక పక్కవాళ్ళ గురించి కూడా ఆలోచించటము నేర్చుకుంటున్నట్లు అనుకున్నాడు. బయట యింకా వాన కురుస్తూనే వుంది. ఎందుకో అతనికి ఆ వానేదో తన మనసులోనే కురిసి తనను నిర్మలం చేస్తున్నట్లనిపించింది. ఎంతో ప్రశాంతత చేకూరినట్లుంది.

పంతాలు, పట్టింపులు మానేసి భార్య దగ్గరకి వెళ్ళాలన్న మంచి ఆలోచనతో నిదురకై ప్రయత్నిస్తే, ఎన్నో రోజుల తర్వాత మూసుకున్న అతని కళ్ళలోకి నిదురమ్మ వెంటనే వచ్చి రెప్పల తలుపులు వేసింది హాయిగా! ●

